## నేడు గీతా జయంతి వేడుకలు

**సుభాష్‌నగర్‌:** శివశక్తి ధ్యాన ఆధ్వర్యంలో ఆదివారం గీతా జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. షాపూర్‌నగర్‌ మార్కెట్‌ సమీపంలోని హెచ్‌ఎంటీ కమ్యూనిటీ హాల్‌లో సాయంత్రం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ వేడుకల్లో భాగంగా సామూహిక గీత పఠనం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## నేడు బీఆర్‌ఎస్‌ సమావేశం

**దుండిగల్‌:** గండిమైసమ్మలోని మేడ్చల్‌ జిల్లా బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 9న బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ అధ్యక్షతన సమన్వయ సమావేశం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## హామీల అమలుకు ప్రభుత్వం కృషి

**కూకట్‌పల్లి:** ఏడాది పాలనలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, మిగిలిన హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్యవైశ్య కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కాల్వ సుజాత అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ బీ బ్లాక్‌ కాంగ్రెస్‌ కమిటీ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌, కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు ఓడించారని గుర్తు చేశారు.

# ప్రభుత్వాసుపత్రికి మహర్దశ

**220 పడకలకు మల్కాజిగిరి ఆసుపత్రి అప్‌గ్రేడ్‌**
- మెడికల్‌ కాలేజీకి అనుబంధంగా వసతులు
- డయాగ్నస్టిక్‌ హబ్‌, రేడియాలజీ ల్యాబ్‌



మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రి

**సాక్షి,సిటీబ్యూరో:** మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రికి మంచిరోజులు వస్తున్నట్లు కనిపిస్తోంది. ఈసీఐఎల్‌లోని కుత్బుల్లాపూర్‌ ప్ర భుత్వ మెడికల్‌ కాలేజీకి అనుబంధంగా మల్కా జిగిరి ప్రభుత్వ ఆసుపత్రిని మార్చడంతో మహ ర్దశ కలిగినట్టైంది. మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింతగా పెరగనున్నాయి.

**వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి..**

ప్రభుత్వ ఆదేశాల మేరకు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచడంతో పాటు దానికి తగ్గట్టుగా అన్నీ వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మల్కాజిగిరి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో ప్రస్తుతం 70 పడకలు ఉండగా.. ఆ సంఖ్యను 220 పడకలకు పెంచారు.

**అదనపు సిబ్బంది నియామకం..**

మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన పడకల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటికే 94 మంది డాక్టర్లను నియమించారు. ఇందులో మెడికల్‌ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు 49 మంది ఉండగా.. వైద్యారోగ్యశాఖ డాక్టర్లు 45 మంది ఉన్నారు. దీనికి తగ్గట్టుగా స్టాఫ్‌ నర్సులను కూడా నియమించేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్‌ నర్సుల సంఖ్య 30 ఉండగా.. ఆ సంఖ్యను 100కు పైగా పెంచేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

**ప్రజలకు అందుబాటులో మరిన్ని సేవలు..**

ప్రభుత్వ మెడికల్‌ కాలేజీలో అనాటమీ, బయో కెమిస్ట్రీ, పిజియాలజీ, సైకాలజీ ,పాథాలజీ, మైక్రోబయాలజీ, గైనకాలజీ , పిడియాట్రిక్స్‌, జనరల్‌ సర్జన్‌, మెడిసిన్‌, సైకాలజీ, ఆర్థోపెటిక్‌, ఈఎన్టీ, అప్తమాలజీ, రేడియాలజీ డిపార్ట్‌మెంట్లు ఉండటంతో దీనికి సంబంధించిన విభాగాలు మల్కాజిగిరి జనరల్‌ ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటుకానుండటంతో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందనున్నాయి.

**అదనపు పరికరాలతో పెరగనున్న వసతులు..**

డయాగ్నస్టిక్‌హబ్‌తో పాటు రేడియాలజీకి సంబంధించిన విభాగాలు కూడా త్వరలో ఆసుపత్రికి రానున్నాయి. మరో రెండేళ్లలో మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల సంఖ్యతో పాటు వైద్యసేవల పరంగా మరిన్ని వసతులు ఏర్పడే అవకాశం ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అవసరమైన సదుపాయాలతో పాటు కావాల్సిన పరికరాలు, పారామెడికల్‌, వైద్య సిబ్బంది సంఖ్య కూడా పెంచనున్నారు.

**అల్వాల్‌ సూపర్‌ స్పెషల్‌ ఆసుపత్రితో..**

నియోజకవర్గ పరిధిలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టీమ్స్‌ (సూపర్‌ స్పెషాలిటీ (ప్రభుత్వాసుపత్రి) పూర్తైతే మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా ప్రజలకు సముచిత స్థాయిలో వైద్యసేవలు అందించగలమని, ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

**మూడు సీహెచ్‌సీలు..**

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్‌, మేడ్చల్‌, శామీర్‌పేట్‌లో కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్‌ (సీహెచ్‌సీ)లు, 28 యూపీహెచ్‌సీలు, 12 పీహెచ్‌సీలు, 112 బస్తీ దవాఖానాలు, 69 పల్లె దవాఖానాలు ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఉప్పల్‌, మల్కాజిగిరి, మేడ్చల్‌, కీసర, జవహర్‌ నగర్‌, అల్వాల్‌, బాలానగర్‌, మల్లాపూర్‌, షాపూర్‌నగర్‌లోని ఆరోగ్యకేంద్రాల్లో ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటుంది.

- నారపల్లి ,కుషాయిగూడ, ఎంసీపల్లి, కుత్బుల్లాపూర్‌, దుండిగల్‌, పర్వతానగర్‌, వెంకట్‌రెడ్డినగర్‌ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గర్భిణులకు ప్రసవాలను నిర్వహిస్తున్నట్లు వైద్యశాఖ తెలిపింది.
- ఈసీఐఎల్‌లో మెడికల్‌ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్‌ కళాశాల ఏర్పాటు చేశారు. జిల్లాలో కొనసాగుతున్న బస్తీ,పల్లె దవాఖానాలు, సీహెచ్‌సీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్యశాఖ సేవలందిస్తోంది.



**ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన వైద్యసేవలు**

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్‌రంగంలో 7 మెడికల్‌ కాలేజీలు ఉన్నాయి. ఈసీఐఎల్‌లో ప్రభుత్వ మెడికల్‌ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింత పెరిగే అవకాశం ఉంది.
– డా. రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్‌ఓ

## సీపీఎం మహాసభలకు తరలిన కార్యకర్తలు


రోడామిస్త్రీనగర్‌లో సీపీఎం జెండాను ఆవిష్కరించిన లక్ష్మణ్‌

**కుత్బుల్లాపూర్‌:** సీపీఎం మేడ్చల్‌ జిల్లా మూడో మహాసభలను పురస్కరించుకుని శనివారం రోడామిస్త్రీనగర్‌లో ఆ పార్టీ మండల కార్యదర్శి లక్ష్మణ్‌ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రగతినగర్‌లో మహాసభలు జరుగుతున్న సుందరయ్యభవన్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, శంకర్‌, రావుల స్వాతి, అంజయ్య, దేవదానం, జాకీర్‌, అంబయ్య, మల్లారెడ్డి, ఆంజనేయులు తదితరులు తరలివెళ్లారు.

## రోడ్డు సమస్యపై కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు, నందనవనం కాలనీ వాసులు

**నిజాంపేట్‌:** నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధిలోని నందనవనం కాలనీ రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో కాలనీవాసులు కమిషనర్‌ సాబేర్‌ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాదరాజు, మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ కో కన్వీనర్‌ ఎం.ఆర్‌.ఎస్‌. రాజులు మాట్లాడుతూ నందనవనం కాలనీలో సరైన రోడ్డు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిధులు మంజూరు చేసి సీసీ రోడ్డు వేయాలన్నారు. దీనిపై కమిషనర్‌ స్పందిస్తూ విడతలవారీగా కాలనీలో రోడ్లు వేస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అశోక్‌, కాలనీ వాసులు ఉన్నారు.

## టైలరింగ్‌ సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న సురేష్‌కుమార్‌

**చింతల్‌:** మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు కుట్టుమిషన్లు ఎంతో ఉపయోగపడతాయని లార్డ్స్‌ వెల్ఫేర్‌ ఆర్గనైజేషన్‌ వ్యవస్థాపకుడు లయన్‌ సురేష్‌కుమార్‌ అన్నారు. కుత్బుల్లాపూర్‌ గణేష్‌ నగర్‌లోని లార్డ్‌ వెల్ఫేర్‌ ఆర్గనైజేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్‌ సెంటర్‌లో శుక్రవారం రాత్రి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్‌ కుమార్‌ మాట్లాడుతూ ఈ సెంటర్లో ఇప్పటివరకు 12 బ్యాచ్‌లలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు సొంతంగా మిషన్లు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పదమూడో బ్యాచ్‌ మహిళలకు సర్టిఫికెట్లను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో అగస్త్య నందన్‌, టైలరింగ్‌ టీచర్‌ లక్ష్మి, స్రవంతి, సాయి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంగౌడ్‌ను కలిసిన యూత్‌ కాంగ్రెస్‌ నేతలు


జీడిమెట్ల డివిజన్‌ యూత్‌ కాంగ్రెస్‌ ప్రెసిడెంట్‌ సందీప్‌గౌడ్‌ను సత్కరిస్తున్న శ్రీశైలంగౌడ్‌

**కుత్బుల్లాపూర్‌:** కాంగ్రెస్‌ పార్టీ అనుబంధ కమిటీలను బలోపేతం చేసే దిశగా అధిష్టానం చర్యలు చేపట్టిందని మాజీ ఎమ్మెల్యే, సీనియర్‌ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. యూత్‌ కాంగ్రెస్‌ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నాయకులు శనివారం శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జీడిమెట్ల డివిజన్‌ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పులి సందీప్‌గౌడ్‌ను సత్కరించిన అనంతరం శ్రీశైలంగౌడ్‌ మాట్లాడుతూ నియోకవర్గంలోని యువత పార్టీ వైపు మొగ్గు చూపేలా ప్రభుత్వ పథకాల ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు దమ్మని శ్రావణ్‌ కుమార్‌, బాలప్ప, డివిజన్‌ అధ్యక్షుడు బేకు శ్రీనివాస్‌, బండి శ్రీనివాస్‌గౌడ్‌, పులి అనిల్‌, అంజి, మల్లారెడ్డి, వినయ్‌, యాస్కి ప్రవీణ్‌, భాస్కర్‌ తదితరులు ఉన్నారు.

# ఆన్‌లైన్‌లో సర్వే వివరాల నమోదు

**ప్రత్యేక సిబ్బంది నియామకం**


సర్వే వివరాలు ఆన్‌లైన్‌ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఉప కమిషనర్‌ నరసింహ

**కుత్బుల్లాపూర్‌:** సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ మేరకు కుత్బుల్లాపూర్‌, గాజుల రామారం సర్కిళ్ల ఉప కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక సిబ్బందిని నియమించారు. జంట సర్కిళ్లతోపాటు కొంపల్లి, దుండిగల్‌ మున్సిపాలిటీలు నిజాంపేట్‌ కార్పొరేషన్‌ పరిధిలో 150 ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్‌, 10 ఎన్యుమరేటర్లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి సర్వే పూర్తి చేశారు. ఈ తంతు ముగియడంతో వాటిని కంప్యూటర్‌లో భద్రపరిచే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. జంట సర్కిళ్ల పరిధిలో ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి ప్రత్యేకంగా 200 మంది సిబ్బందిని నియమించి ఉదయం 10: 30 నుంచి రాత్రి 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌లో 73,737 దరఖాస్తులు రాగా రెండు రోజుల్లో 3,393 దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. గాజుల రామారం సర్కిల్‌లో 84,376 దరఖాస్తులు రాగా, 2,192 దరఖాస్తులను పూర్తిచేశారు. మరో 15 రోజుల్లో మొత్తం దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో భద్రపరిచి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఒక్కో దరఖాస్తు వివరాల నమోదు నిమిత్తం సిబ్బందికి 14 రూపాయల చొప్పున చెల్లిస్తున్నట్లు తెలిపారు. జంట సర్కిల్లో సుమారు 1,58,103 ఇళ్ల యజమానులను కలిసి వారి వివరాలను తీసుకున్నారు. రెండు మున్సిపాలిటీలు,కార్పొరేషన్‌లో సైతం ఇదే తరహాలో ఎన్యుమరేటర్లు విధుల్లో పాల్గొన్నారు.

# ప్రమాదంలో దేశ రాజ్యాంగం: సీపీఎం



ప్రగతినగర్‌లో జరిగిన ర్యాలీలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌

**నిజాంపేట్‌:** భారత రాజ్యాంగం పెనుప్రమాదంలో ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు నరసింహారావు అన్నారు. మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా సీపీఎం మూడో మహాసభలు శనివారం ప్రగతినగర్‌లోని లీలా సుందరయ్య ఫంక్షన్‌హాలులో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇటీవల మరణించిన ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, పలువురు నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న దారిద్ర్యం, ఆర్థిక సంక్షోభానికి పెట్టుబడిదారి విధానాలు పరిష్కారం చూపలేకపోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకుడు పాలడుగు భాస్కర్‌ మాట్లాడుతూ ఒకవైపు ఆకలితో పేదలు అల్లాడుతుంటే, మరోవైపు సంపన్నులు పెరిగిపోతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపై దాడులకు పాల్పడుతోందని, రైతు వ్యతిరేక చట్టాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం తప్ప ఒక్క హామీ కూడా సరిగా నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి సత్యం, నాయకులు కోమటి రవి, చంద్రశేఖర్‌, అశోక్‌, వినోదం, కృష్ణారావు, వెంకట్రామయ్య, వరప్రసాద్‌, లక్ష్మణ్‌, రాజశేఖర్‌, రాథోడ్‌ సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బ్యాడ్మింటన్‌ పోటీల్లో లియోషా విజయం


జాతీయ బ్యాడ్మింటన్‌ పోటీల్లో గోల్డ్‌ మెడల్స్‌ సాధించిన లియోషా

**దుండిగల్‌:** దుండిగల్‌ మున్సిపల్‌ బౌరంపేట్‌కు చెందిన కోరుకొండ లియోషా జాతీయ బ్యాట్మింటన్‌ పోటీల్లో విజయం సాధించింది. మహారాష్ట్రలోని థానేలో జరిగిన మూడో మినీ( అండర్‌-11) జాతీయ బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ పోటీల్లో సింగిల్స్‌, డబుల్స్‌ విభాగాల్లో కోరుకొండ లియోషా గోల్డ్‌ మెడల్స్‌ గెలుచుకొని సత్తా చాటింది. లియోషా భౌరంపేట్‌లోని ఢిల్లీ పబ్లిక్‌ స్కూల్‌(డీపీఎస్‌)లో గ్రేడ్‌-4 చదువుతోంది. సిక్కి సుమిత్‌ బ్యాడ్మింటన్‌ అకాడమీలో కోచ్‌ సుమిత్‌రెడ్డి నేతృత్వంలో రెండున్నరేళ్లుగా లియోషా సాధన చేస్తోంది. గోల్డ్‌ మెడల్స్‌ సాధించిన లియోషాను డీపీఎస్‌ ప్రిన్సిపాల్‌ గౌరీసర్కార్‌, స్కూల్‌ వైస్‌ చైర్మన్‌ గోరంట్ల రమేష్‌, సిక్కిరెడ్డి, సుమిత్‌రెడ్డి, గోపీచంద్‌ తదితరులు అభినందించారు.

## వార్షికోత్సవం


కూన శ్రీశైలంగౌడ్‌ను సత్కరిస్తున్న ఫాదర్‌ మోడల్‌ స్కూల్‌ యాజమాన్యం

**సుభాష్‌నగర్‌:** సుభాష్‌ చంద్రబోస్‌ నగర్‌లోని ఫాదర్‌ మోడల్‌ స్కూల్‌ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుతో పాటు వివిధ క్రీడాంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను పాఠశాల కరస్పాండెంట్‌ పద్మ, డైరెక్టర్లు రవికిరణ్‌, ప్రవళిక సత్కరించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు పండరి, పత్తి శ్రీనివాస్‌, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ కమిటీ ఎన్నిక

**కేపీహెచ్‌బీకాలనీ:** ఏబీవీపీ జేఎన్‌టీయూ హైదరాబాద్‌ యూనివర్సిటీ అధ్యక్షుడిగా శ్రీరామ్‌ నాయక్‌, కార్యదర్శిగా శివమణిని శనివారం రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంపస్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సంజయనీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


చర్చి గాగిల్లాపూర్‌లో వాలీబాల్‌ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శంభీపూర్‌ కృష్ణ

**దుండిగల్‌:** చదువుతోపాటు క్రీడలపై కూడా విద్యార్థులు దృష్టి సారించాలని దుండిగల్‌ మున్సిపల్‌ కౌన్సిలర్‌, బీఆర్‌ఎస్‌ నేత శంభీపూర్‌ కృష్ణ అన్నారు. శనివారం చర్చి గాగిల్లాపూర్‌లోని సెయింట్‌ ఇగ్నటస్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్‌ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి వెళ్లాలని, అదే విధంగా అన్ని క్రీడాపోటీల్లో చురుకుగా పాల్గొని రాణించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ యువతను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు రంజిత్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ పద్మారావు, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, శంకర్‌ నాయక్‌, మహేందర్‌ యాదవ్‌, భారత్‌ కుమార్‌ తదితరులు ఉన్నారు.

# మురుగు సమస్యపై నిరసన


సూరారం రామ్‌లీలా మైదానం వద్ద నిరసన తెలుపుతున్న స్కూల్‌ విద్యార్థులు, దుకాణదారులు..

**సుభాష్‌నగర్‌:** మురుగు సమస్యను అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళితే... సూరారం కాలనీ రామ్‌లీలా మైదానం సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ ధ్వంసమై కొన్ని నెలలుగా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో స్కూల్‌ విద్యార్థులు, స్థానిక దుకాణదారులు, అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో శనివారం బీజేపీ, మనం ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విద్యార్థులు, స్థానిక వ్యాపారులతో కలిసి ప్లకార్డులు చేతబూని నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు ప్రవాహంతో రాకపోకలకు ఆటంకంగా మారుతోందని, ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌జామ్‌ అవుతోందన్నారు. మురుగు సమస్యను పరిష్కరించకుంటే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు భైండ్ల రాము, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్తిబాబు, మనం ఫౌండేషన్‌ అధ్యక్షుడు శ్యాం కుమార్‌, బీజేపీ డివిజన్‌ కార్యదర్శి గంధం కుమారస్వామి పాల్గొన్నారు.

# యాసిడ్‌ ఘాటుతో విద్యార్థులకు అస్వస్థత


పల్స్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి


చింతల్‌ శ్రీచైతన్య పాఠశాలలో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు

**చింతల్‌:** చింతల్‌ శ్రీ చైతన్య హైస్కూల్‌ బ్రాంచిలో శనివారం ఉదయం 25 మంది విద్యార్థులు యాసిడ్‌ ఘాటు ప్రభావంతో అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలోని మూత్రశాలలను సిబ్బంది శుభ్రం చేస్తుండగా యాసిడ్‌నేలపై పెద్ద ఎత్తున ఒలికిపోయింది. తీవ్రమైన ఘాటుతో పాఠశాల భవనంలోని మూడో అంతస్తు అంతటా ఆవరించింది. దీంతో విద్యార్థులు దగ్గుతూ, భయాందోళనగా తరగతి గదుల నుంచి బయటికి పరిగెత్తుకుంటూ వచ్చారు. గమనించిన సిబ్బంది యాసిడ్‌ పడినచోట నీళ్లతో శుభ్రం చేసేందుకు ప్రయత్నించారు. లంచ్‌ సమయంలో తరగతి గదుల కిటికీలు మూసి ఉంచడంతో ఊపిరి ఆడక మరి కొంతమంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. 20 మంది విద్యార్థులను స్థానిక పల్స్‌ ఆసుపత్రిలో చేర్పించగా, మరో ఐదుగురిని ఆర్‌ఎస్‌సీ ఆసుపత్రిలో చేర్పించి వైద్యం అందించారు. అనంతరం ప్రమాదమేమీ లేదంటూ వైద్యులు వారిని డిశ్చార్జి చేశారు.

**ప్రమాదం ఏమీ లేదు: ప్రిన్సిపాల్‌**

శ్రీ చైతన్య బ్రాంచి ప్రిన్సిపాల్‌ భార్గవిని 'సాక్షి' వివరణ కోరగా యాసిడ్‌ నేల మీద పాడిన సంఘటనలో 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వారిని ఆసుపత్రిలో చేర్పించగా గంట వ్యవధిలోనే డిశ్చార్జి చేశారని తెలిపారు. తమ సిబ్బంది తప్పిదం కారణంగా యాసిడ్‌నేల మీద పడిందని పేర్కొన్నారు. విద్యార్థులు రక్తపు వాంతులు చేసుకున్నారని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

## నకిలీ పత్రాలతో ప్లాటు రిజిస్ట్రేషన్‌కు యత్నం

**సూరారంలో ఇద్దరు వ్యక్తుల అరెస్టు**


పోలీసుల అదుపులో నాగేశ్వరరావు, శ్రీనివాసరావు

**సుభాష్‌నగర్‌:** నకిలీ దస్తావేజులతో 200 గజాలస్థలానికి రిజిస్ట్రేషన్‌ చేయించేందుకు ప్రయత్నిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఈ నంఘటన సూరారంలోని సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో చోటు చేసుకుంది. సబ్‌ రిజిస్ట్రార్‌ అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లికి చెందిన ఆర్‌.నాగేశ్వరరావు అనే వ్యక్తి మల్లంపేటలోని ఓ వెంచర్‌లో ఉన్న 200 గజాల స్థలాన్ని రూ.30 వేలకు గజం చొప్పున విక్రయించేందుకు బాచుపల్లికి చెందిన హనుమంత శ్రీనివాసరావుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. శనివారం సూరారంలోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో హరికృష్ణ అనే వ్యక్తి వద్ద డాక్యుమెంట్‌ వర్క్‌ చేయించుకున్నారు. అనంతరం సదరు ఫైల్‌ సబ్‌రిజిస్ట్రార్‌ వద్దకు వెళ్లింది. నాగేశ్వరరావును సబ్‌రిజిస్ట్రార్‌ పలు ప్రశ్నలు అడగగా పొంతన లేని సమాధానం చెప్తూ తడబడ్డాడు. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌ సిబ్బందిని అప్రమత్తం చేసి నాగేశ్వరరావును పట్టుకున్నారు. సాక్షులుగా వచ్చిన సుబ్రహ్మణ్యం, మరో వ్యక్తి అక్కడ నుంచి జారుకున్నారు. అనంతరం నాగేశ్వరరావు, శ్రీనివాసరావులను సూరారం పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై స్థలం కొనుగోలు చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మల్లంపేట మాజీ సర్పంచ్‌ మోహన్‌రెడ్డి ద్వారా ప్లాటును కొనుగోలు చేసినట్లు తెలిపారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ఓ వ్యక్తి ఆ ప్లాటును తనకు రిజిస్ట్రేషన్‌ చేసినట్లు పొంతన లేని సమాధానాలు చెప్పాడు. ఈ విషయమై సీఐ భరత్‌కుమార్‌ మాట్లాడుతూ కేసును దర్యాప్తు చేసిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## ఖోఖో పురుషుల జట్టు ఎంపిక

**కేపీహెచ్‌బీకాలనీ:** జేఎన్‌టీయూహెచ్‌ యూనివర్సిటీలో ఖోఖో పురుషుల జట్టును శనివారం ఎంపిక చేశారు. యూనివర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ ప్రొఫెసర్‌ దిలీప్‌, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నల్లగొండ అశోక్‌ ఆధ్వర్యంలో సెలక్షన్‌ను నిర్వహించారు. డిసెంబర్‌ 27 నుంచి 31వ తేదీ వరకు సెంట్రల్‌ యూనివర్సిటీ ఆఫ్‌ తమిళనాడులో జరిగే ఖోఖో ఇంటర్‌ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో జేఎన్‌టీయూ జట్టు పాల్గొననున్నట్లు తెలిపారు. వివిధ కళాశాలల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

